క్లుప్తంగా

బాల్య స్నేహితుడికి చేయూత



దేవరుప్పుల: అనారోగ్యం పాలైన బాల్య స్నేహితుడు చిక్కుల యాదిగిరికి సామాజిక సేవకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ రూ.50 వేల ఆర్థిక సాయం అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో బోరం నరేందర్ రెడ్డి, పాండురాజుల మధు, గోడిశాల వెంకన్న, జ్ఞానేశ్వర్, జుంకాల ఉపేందర్, బానోత్ రమేష్, జోగు రవీందర్, చొప్పరి కుమార్, మునిగొండ రవి,కర్రె మహేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

దేవరుప్పుల : సీఐఈఆర్ విధానం ద్వారా సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం బస్వ నాగరాజు(సీతారాంపురం), మంద రాకేష్(సింగరాజుపల్లి)లకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్ వినియోగదారులు కొనుగోలు చేసినప్పుడు విధిగా తగు రశీదు పత్రాలతో పొంది అనివార్యంగా పోయినప్పుడు సమాచారంతో మీసేవలో దరఖాస్తు చేసినట్లయితే శాఖపరంగా చర్యలు చేపడుతామన్నారు.

కాపర్ వైర్ చోరీ



లింగాలఘణపురం: మండలంలోని బండ్లగూడెంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను దొంగిలించారు. రైతులు మడికొండ నర్సిరెడ్డి, వంచ అంజిరెడ్డి వ్యవసాయ బావుల వద్ద ఉన్న ఎస్ఎస్-50, ఎస్ఎస్-16 నంబర్లు గల 25 కేవీ, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను వైర్ కట్ చేసి గద్దెలపై నుంచి కింద పడేసి ప్లేట్లు విప్పి అందులోని కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్ల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన ధాన్యం



లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన గాదరి స్వామి వ్యవసాయ పొలంలో బుధవారం 33/11 కేవీ విద్యుత్ వైర్ తెగి పొలంలో పడి షార్ట్‌సర్క్యూట్‌తో రాశిగా పోసిన సుమారు పది బస్తాల ధాన్యం, పొలంలో చుట్టలుగా చుట్టిన గడ్డి కాలిపోయింది. లూజులైన్‌లో భాగంగా బుధవారమే ట్రాన్స్‌కో సిబ్బంది మిడిల్ పోల్ పాతారు. మిడిల్ పోల్‌కు కనెక్షన్ ఇవ్వకముందే వైర్ తెగి రైతుకు నష్టం జరిగింది. నష్టపరిహారం ఇవ్వాలని రైతు స్వామి వేడుకుంటున్నాడు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



రఘునాథపల్లి: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని మంగళిబండతండాలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానోత్ లక్పతి ఉదయాన్నే ఆవులను వ్యవసాయ బావివద్దకు మేతకు తీసుకెళ్లాడు. సమీపంలో కిందకు ఉన్న 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తు పెంచాలని పలుమార్లు విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రూ.60 వేల విలువైన ఆవు మృతిచెందిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి టౌన్: తాటి చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండలంలోని చెన్నూరులో జరిగింది. గీత కార్మికుడు మూల అశోక్ కల్లుగీసేందుకు తాటిచెట్టు ఎక్కగా ప్రమాదశాత్తు కిందపడటంతో కాలు విరిగింది. చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన గీత కార్మికుడిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూల వెంకటేశ్వరు గౌడ్, మండల అధ్యక్షుడు పొడిశెట్టి వెంకన్న కోరారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్

బచ్చన్నపేట: పల్లెలను పరిశుభ్రంగా ఉంచడానికి గ్రామాల నాయకులు, అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధి పలు గ్రామాల్లో పర్యటించి ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని, మురుగు కాల్వల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని, వీధుల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. తాగు నీటి పైపులకు లీకేజీ లేకుండా చూడాలని, మురుగు కాల్వల నుంచి పైపులు వేయొద్దని చెప్పారు. ఇళ్లలోని చెత్తను ఆరు బటయ పడవేయకుండా తడి, పొడిచెత్తను వేరు చసి జీపీ ట్రాక్టర్లలో వేసేలా మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణ భేష్

లింగాలఘణపురం: నర్సరీల నిర్వహణ భేషుగ్గా ఉందని, అన్ని నర్సరీలకు ఆదర్శంగా ఉందని పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక పరిశీలకురాలు ఎస్.కళ్యాణి అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవంలో భాగంగా గురువారం ఆమె నెల్లుట్ల, లింగాలఘణపురం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. నెల్లుట్లలో సర్పంచ్ చిట్ల స్వరూపరాణిభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్లెప్రకృతి వనం, నర్సరీ, సెగ్రిగేషన్‌షెడ్‌లను నిర్వహణ చూసి ఎంతో బాగున్నాయని అభినందించారు. నర్సరీలో పండ్ల మొక్కలను చూసి ఎక్కడ లేనివిధంగా నిర్వహణ బాగుందన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో పారిశుద్ధ్య సిబ్బంది వీధులను శుభ్రం చేస్తుండగా పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు.



బచ్చన్నపేట: గాపూర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఏఓ

డీపీఓ రంగాచారి, ఎంపీపీ చిట్ల జయశ్రీ, లింగాలఘణపురం సర్పంచ్ విజయ్‌మనోహర్, ఎంపీడీఓ మల్లికార్జున్, ఎంపీఓ సీతారామనాయుడు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసురెడ్డి, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

పల్లె ప్రగతి పనులు పకడ్బందీగా చేపట్టాలి

జనగామ రూరల్: గ్రామాల్లో పల్లె ప్రగతి పనులను పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక పరిశీలకురాలు కళ్యాణి అన్నారు. గురువారం మండల పరిధి శామీర్‌పేట, పసరమడ్ల గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, పల్లెప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్, ఇంకుడు గుంతలు, సైడ్ డ్రైయినేజీ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీపీ మేకల కళింగరాజు, ఎంపీడీఓ హసీం, ఎంపీఓ సంపత్‌కుమార్, సర్పంచ్‌లు స్వరూప, స్వప్న పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంలో గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలి



లింగాలఘణపురం: మొక్కలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు ఎస్.కళ్యాణి



కొడకండ్ల: పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కుమారస్వామి

కొడకండ్ల: ఎక్కడా చెత్త లేకుండా ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్యంలో పాకాల గ్రామాన్ని ఆదర్శంగా నిలపాలని ప్రత్యేక అధికారి, ఏపీఓ నరిగే కుమారస్వామి సిబ్బందికి సూచించారు. శానిటేషన్ వారోత్సవాల్లో భాగంగా గురువారం గ్రామంలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించి అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి కోట బయ్యన్న, ఎఫ్ఏ సాలయ్య, వెంకటేశ్వర్లు, నాగయ్య, సోమయ్య, సంపత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి కేసీఆర్ దిక్సూచి

రఘునాథపల్లి: తొమ్మిదేళ్ల కాలంలో ప్రపంచం అబ్బురపడేలా ఎక్కడ లేనివిధంగా తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికి దిక్సూచిలా మారాడని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. గురువారం మండలంలోని నిడిగొండ శివారు కురుమగూడెంలో రూ.5 లక్షలతో మంజూరైనా కురుమ సంఘం భవనానికి ఆయన శంకుస్థాపనం చేశారు. అనంతరం నిడిగొండ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ నామాల బుచ్చయ్య అధ్యక్షతన జరిగిన ఖిలాషాపూర్ క్లస్టర్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, అభివృద్ధిలోనూ రాష్ట్రం శరవేగంతో దూసుకుపోతుందన్నారు.



నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే

ఏయ్ బిడ్డా.. ఇది రాజన్న అడ్డా

ఆత్మీయ సమ్మేళనంలో ఏయ్ బిడ్డా.. ఇది రాజన్న అడ్డా అంటూ కళాకారుల పాటకు వేదికపై ఎమ్మెల్యే రాజయ్య చిందేశారు. తొడగొట్టి గంతేస్తూ కార్యకర్తలను ఉత్రూతలూగించారు. జిల్లా జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లం మణికంఠ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.కుమార్‌గౌడ్, విజయ్, రవీందర్, మనోజ్‌రెడ్డి, దెవేందర్‌రెడ్డి, రాజు, రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలియజేయండి



రైతులతో మాట్లాడుతున్న సీఐ సంతోష్

చిల్పూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు, మిల్లుల్లో సమస్యలుంటే తమకు తెలియజేయాలే తప్ప ఆందోళనలు చేయొద్దని జనగామ రూరల్ సీఐ సంతోష్ రైతులతో అన్నారు. మండలంలోని రాజవరంలో రైతు సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఐతో పాటు స్థానిక ఎస్సై వినయ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ధాన్యం విషయంలో రైతులు స్వతహాగా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సమస్యలుంటే పరిష్కరించేందుకు పోలీస్ శాఖ ఉందనే విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు.

వనిత క్లబ్ గ్రేటర్ జనగామ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవంలో నూతన క్లబ్ సభ్యులు

జనగామ: జనగామ పట్టణంలోని సీరి ఫంక్షన్ హాల్‌లో గురువారం వనిత క్లబ్ గ్రేటర్ జనగామ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పూర్వ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆయిత రాములు మాట్లాడుతూ జనగామలో మహిళా క్లబ్ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. ఇంటర్నేషనల్ నుంచి నిధులు తీసుకువచ్చి, మహిళ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరించాలన్నారు. నూతన అధ్యక్షురాలు మాధంశెట్టి వరూధి, కార్యదర్శి గంగిశెట్టి అనుజా, కోశాధికారి పులిగిళ్ళ నాగమణి, కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కో-ఎడ్ కళాశాల టాపర్ విజ్ఞేశ్‌కు క్లబ్ నుంచి ఉన్నత చదువుల కోసం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ రవ్వ గీత, పూర్వ జిల్లా గవర్నర్‌లు దొడ్డ మోహన్‌రావు, గార్లపాటి సంతోష్, గంగిశెట్టి ప్రమోద్ కుమార్, పబ్బతి సునీత, గంప సాంబ మూర్తి, గార్లపాటి వెంకటేశ్వర్లు, గార్లపాటి నిఖిల్, పోకల లింగయ్య, మహంకాళి హరిశ్చంద్రగుప్త, వెంకటేశ్వర్లు, రవీందర్, అశోక్, భిక్షపతి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పేరిట ఇసుక దందా..?

- మున్‌పహాడ్ వద్ద టిప్పర్లను అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు
- తహసీల్దార్ రవీందర్‌రెడ్డి హామీ మేరకు పోలీస్‌స్టేషన్‌కు అప్పగింత

దేవరుప్పుల : మండల కేంద్రంలోని రహదారి నుంచి కొత్తకాలనీ వరకూ కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పేరిట అక్రమ ఇసుక రవాణా దందా కొనసాగడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో దుర్గామాత ఉత్సవాల కంటే ముందు కామారెడ్డిగూడెం ఓ ఫామ్‌హౌజ్ వద్ద నిల్వ ఉన్న ఇసుక నిల్వలపై తీవ్ర దుమారం లేచింది. ఈ తరుణంలోనే గురువారం రాత్రి రోడ్డు కాంట్రాక్టరుకు చెందిన రెండు టిప్పర్లలో ఇసుక లోడుతో సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి తరలిస్తుండగా మున్‌పహాడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు పారుపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లగా సంబంధిత అధికారులు తగు హామీ ఇస్తే తప్ప టిప్పర్లను అప్పగించమని నిరాకరించారు. ఎట్టకేలకు ఫోన్‌లో తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో పోలీస్‌స్టేషన్‌కు ఇసుక లోడుతో ఉన్న టిప్పర్లను తరలించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాకస్వామి, సీత మల్లయ్య, యాకయ్య, రమేష్, ఉప్పలయ్య, ఐలయ్య, యాదయ్య, యాకన్న పాల్గొన్నారు.



ఇసుక లోడుతో ఉన్న టిప్పర్లతో కాంగ్రెస్ నాయకులు

'జన్ ఆరోగ్య' సమితి కమిటీ ఎన్నిక

కొడకండ్ల: మండలంలోని రామవరం పల్లె దవాఖాన జన్ ఆరోగ్య సమితి కమిటీని గురువారం ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా సర్పంచ్ మందుల శిరీష, కోచైర్‌పర్సన్‌గా డాక్టర్ హరికృష్ణ, సెక్రటరిగా బోదాస్ రాజు, సభ్యులుగా ఏఎన్ఎంలు ఏలీషా, అరుణలు, ఆశ కార్యకర్తలు రజిత, రమణ, శారద, స్వరూప, గాలమ్మ ఎన్నికయ్యారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

నర్మెట: పీఏసీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని డీసీ తండా నాయకులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. కొర్ర రాజ్‌కుమార్, నున్సావత్ సురేష్, గుగులోత్ మోతీలాల్, హర్యావత్ శ్రీను, కొర్ర తిరుపతి, నరేష్, రాజ్ కుమార్, రవికుమార్, మాలోత్ రమేష్, హుస్సేన్ ఉన్నారు.

బ్రిజేష్ భూషన్‌ను శిక్షించాలి

జనగామ రూరల్: మహిళా రెజ్లర్స్‌పై లెంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజేష్ భూషన్‌ను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అహల్య మాట్లాడుతూ ఎంపీ బ్రిజేష్ భూషన్ సింగ్ మహిళా రెజ్లర్స్‌ను ఇబ్బందులకు గురి చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఫిర్యాదు ఇచ్చినా చర్య తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. చందు, వజేందర్, శభాన, సురేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కారంపురి శ్రీనివాసు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి గురువారం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వెంకన్న ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రెస్‌క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి రేగు యాదగిరి, ఉపాధ్యక్షుడు జానకిరాములు, కోశాధికారి వీరయ్య కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, బి.రంజిత్, బి.శ్రీనివాసు, జీ.కిరణ్‌కుమార్, సీహెచ్ పరశురాములు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

పాలకుర్తి: కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నల్లా నాగిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మంచుప్పులలో జెడ్పీటీసీ పుస్కురి శ్రీనివాస్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్, సర్పంచ్ బొమ్మగాని కొమురయ్య, రైతు బంధు సమితి గ్రామ కో ఆర్డినేటర్ పబ్బతి వెంకట్ రెడ్డి, వైద్యధికారి వెంకటరమణ, సూపర్‌వైజర్ ఇంద్రాణి, ఏఎన్ఎంలు వనజ, భాగ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పోస్టల్ శాఖ తోడ్పాటు

దేవరుప్పుల: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పోస్టల్ శాఖ తోడ్పాటు అందిస్తుందని ఆ శాఖ జనగామ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోస్టాఫీసులో మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ డిపాజిట్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్ల వయసు పైబడిన మహిళలు రూ.1,000 నుంచి 2లక్షల వరకు డిపాజిట్ చేస్తే రెండేళ్ల గరిష్ఠ కాలపరిమితితో 7.5 శాతం వడ్డీ కలిపి ఇస్తామన్నా రు. ఆకర్షణీయమైన వడ్డీల పేరిట బోర్డులు తిప్పే సంస్థల మోసపూరిత చర్యలకు తలొగ్గకుండా నమ్మకమైన పోస్టల్ శాఖలో డిపాజిట్ చేసి ఆర్థిక భద్రత పొందాలని సూచించారు. ఎస్‌పీఎం రవికుమార్, ఎంఓ సిహెచ్ భాస్కర్, ఖలీల్‌పాషా, ఆయా గ్రామా ల బ్రాంచి పోస్టు మాస్టర్, మహిళలు పాల్గొన్నారు.

సన్మానం

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ ఎస్సైగా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన శంకర్‌నాయక్‌ను మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కడియం యువసేన నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువలతో ఘనంగా సత్కరించారు.

రేపు వేలం పాట

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ శ్రీ సిద్దేశ్వరాలయంలో ఈ నెల 20వ తేదీన వేలం నిర్వహిచనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేలం పాటలలో పాల్గొనే వారు టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకోవడానికి రూ.2 లక్షలు, తలనీలాలు సేకరించేందుకు రూ.1.50 లక్షలు, కొబ్బరి ముక్కలు సేకరించేందుకు రూ.25 వేలను బ్యాంకులో డీడీ తీసి వేలంలో పాల్గొనాలని అన్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తాం



ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న పేదలు

జనగామ రూరల్: హైకోర్టును ఆశ్రయించిన నర్మెట మండలంలోని వెల్దండకు చెందిన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకుంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చుంచు విజేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని అందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గ్రామంలో నిర్మించిన ఇళ్లు అధికార పార్టీ నాయకులు అనర్హులకు అందించారని, ఇందుకు సహకరించిన తహసీల్దార్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అర్హులు హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయం చేయాలని ఆర్డర్ ఇచ్చినా అమలు చేయకుండా పట్టించుకోవడంలేదని అన్నారు. పేదలకు న్యాయం చేయకుంటే పాదయాత్ర చేసి సీఎం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో రాధిక, సావిత్రి, కొమురయ్య, చంద్రకళ, అనిత, కళావతి, కొమురమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన బీజేపీ శ్రేణులు

జనగామ: హైదరాబాద్ నాగోల్‌లో గురువారం నిర్వహించిన తెలంగాణ ఓబీసీ ఆత్మీయ సమ్మేళనానికి జనగామ బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు బేజాటి బీరప్ప, గజ్జుల నారాయణ, కొంతం శ్రీనివాస్, శివరాజ్ యాదవ్, మహిపాల్ తదితరులు ఉన్నారు. తెలంగాణలో 52 శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారం కోసం తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.



హైదరాబాద్‌కు వెళ్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దమ్మ పండుగకు విరాళాల అందజేత

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురంలో ముదిరాజ్ కులస్తులు నిర్వహిస్తున్న పెద్దమ్మ పండుగకు పలువురు విరాళాలను అందించినట్లు కుల పెద్దలు ఇండ్ల సిద్దులు, గొడుగు ప్రసాద్‌లు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి ఆలయానికి రంగులు, పంబాల వారి ఖర్చులకు రూ.50 వేలు, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి రూ.30 వేలు, నరేష్‌కుమార్ టైల్స్‌ను అందించారన్నారు. ఇండ్ల చిన్న రాములు, పెద్ద రాములు, సిద్దిరాములు, సిద్దిమల్లు, మల్లయ్య, దామెర మహేందర్, జగన్‌రెడ్డి, క్రాంతి, బాలకృష్ణ, రాజు, కార్తీక్, కృష్ణ, పంబాల పూజారి రాసమల్ల కొండల్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఎంపీపీ అనిల్‌రెడ్డి

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

లింగాలఘణపురం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి కోరారు. గురువారం బీఆర్ఎస్ యువత విభాగం ముఖ్యనాయకుల సమావేశాన్ని భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌లో గట్టగల్ల శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో యువత ముందుండాలని అన్నారు. జెడ్పీటీసీగా పలు గ్రామాల్లో, గ్రంథాలయాలు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశానని వాటిని వినియోగించుకోవాలని అన్నారు. అదేవిధంగా ఈ నెల 19న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతానికి కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గణపతి, నియోజకవర్గ నాయకులు నాగేందర్, మార్కెట్ డైరెక్టర్ ఆంజనేయులు, మధు, నాయకులు విష్ణు, సంపత్, మహేష్, రాజు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూతనందించాలి



కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ అనిత

జఫర్‌గఢ్: అనాథ పిల్లలకు చేయూతనందించాలని సర్పంచ్ అనిత అన్నారు. మండలంలోని టీబీతండాలోని మా ఇల్లు అనాథ ఆశ్రమంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సతీమణి కడియం వినయరాణి పుట్టిన రోజు వేడుకలు సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్‌బాబు నేతృత్వంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి పిల్లలకు భోజన సదుపాయాన్ని కల్పించారు. అలాగే సర్పంచ్ భర్త సుధాకర్‌బాబు పుట్టిన రోజు వేడుకలు కూడా అనాథ పిల్లల మధ్య జరుపుకున్నారు. ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, బీఆర్ఎస్ నాయకులు రాజేష్‌నాయక్, సర్పంచ్‌లు జైపాల్‌రెడ్డి, పార్వతి రవి, రాజేశ్వరి శ్రీనివాస్, ఎంపీటీసీలు దేవేందర్‌నాయక్, రజాక్‌యాదవ్, కడియం యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్మకంటి నాగరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన సింగపురం అన్నమ్మ(70) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, బాధిత కుటుంబాన్ని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర గురువారం పరామర్శించారు. అన్నమ్మ మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ నాయకులు చింత ఎల్లయ్య, సింగపురం నాగయ్య, రడపాక రాజ్‌కుమార్, మారపాక వసంత్, ప్రశాంతి తదితరులు ఉన్నారు.